GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 286 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 06-06-2024 | పేజీలు : 3

## 8న ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం..



**టి మీడియా, జూన్ 5,ఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించగా మూడోసారి ప్రధాని మోడీ ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఫిక్స్ అయింది. ఈ నెల 8న ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, 543 సీట్లున్న పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు 272 స్థానాలు అవసరమౌతాయి. ఎన్డీఎ కూటమి 292 స్థానాలు పొందగా, ఇండియా బ్లాక్ 234 స్థానాలు సాధించింది. ఈ నేపథ్యంలో ప్రధాని పదవి ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. అయితే, జూన్ 8 సాయంత్రం కర్తవ్యపథ్‌లో ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ఎన్డీఏ పక్షాలు హాజరుకానున్నాయని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.



- వారినాయకులు అవయవదానం చేశారు
- కుట్రతోనే కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఓడిపోయింది
- ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి

# మోదీపై సీఎం రేవంత్ రెడ్డి
# కీలక వ్యాఖ్యలు
## బీఆర్ఎస్ చస్తూచస్తూ బీజేపీని బతికించింది

**టి మీడియా, జూన్ 5, హైదరాబాద్:** తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ఫలితాలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మమ్మల్ని ఆశీర్వదించిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు.. వంద రోజుల పాలనకు ప్రజలు పట్టం కట్టారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో మాకు ఓట్ల శాతం పెరిగింది. మా రెఫరెండంకు ప్రజలు మద్దతు తెలిపారని రేవంత్ చెప్పారు. కాంగ్రెస్ గెలుపుకోసం పోరాడిన కార్యకర్తలకు అభినందనలు తెలిపిన రేవంత్.. కార్యకర్తలు మా గౌరవాన్ని నిలబెట్టారు. బీజేపీ కోసం బీఆర్ఎస్ నాయకులు అవయవదానం చేశారు. బీజేపీ గెలుపుకోసం బీఆర్ఎస్ నాయకులు ఎంతో కృషి చేశారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆత్మ బలిదానం చేసుకుందని రేవంత్ విమర్శించారు. ఏడు నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ డిపాజిట్ కోల్పోయింది. పార్టీ పెట్టినప్పటి నుండి బీఆర్ఎస్ పార్టీకి సిద్దిపేటలో మెజారిటీ వచ్చింది. సిద్దిపేటలో హరీష్ రావుకి పూర్తి పట్టున్నప్పటికీ తమ ఓట్లు బీజేపీకి వేయించారు. బీఆర్ఎస్ చేసిన కుట్రతోనే కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఓడిపోడిందని రేవంత్ అన్నారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవానికి రాలేదు. చిల్లర మల్లర కారణాలు చెప్పి తప్పించుకున్నాడు. ఇప్పటికైనా కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు హెూదా పోషించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు గుండుసున్న ఇచ్చారు. బీఆర్ఎస్ చస్తూచస్తూ బీజేపీని బతికించింది. బీఆర్ఎస్ నాయకుల ఆత్మ గౌరవాన్ని కేసీఆర్ బీజేపీకి తాకట్టుపెట్టాడని రేవంత్ విమర్శించారు. కేసీఆర్ చేస్తున్న దుర్మార్గాన్ని సెక్యులర్ ఫోర్సెస్ గమనించాలి. బీఆర్ఎస్ పార్టీకి బూడిద నే మిగిలింది. ఆ బూడిద తీసుకొని మీ బావకి, నాన్నకి పూయాలంటూ కేటీఆర్ ను ఉద్దేశించి రేవంత్ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ఏర్పడినప్పటి నుండి పార్లమెంట్ లో ప్రాతినిధ్యం లేకుండా ఉండడం ఇదే మొదటిసారి అని రేవంత్ అన్నారు. మోదీ గ్యారంటీకిఉన్న వారంటీ అయిపోయింది. మోదీ.. కాలం చెల్లిపోయింది. మోదీ చరిష్మా తో ఎన్నికలకు వెళ్లిన ఎన్డీయే కూటమికి ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజలు తిరస్కరించిన మోదీ తక్షణమే రాజీనామా చేయాలి. మోదీకి విలువలు ఉంటే ప్రధాని పదవి నుండి హుందాగా తప్పుకోవాలని రేవంత్ అన్నారు. ఈరోజు నుండి మరో రెండు గంటలు అదనంగా పని చేస్తాం. రాష్ట్రంలో ఏ సీటు గెలిచినా, ఏ సీటు ఓడినా నాదే బాధ్యత. గెలుపు ఓటములు నేనే బాధ్యత తీసుకుంటా. మాకు వచ్చిన ఫలితాలు ఉగాది పచ్చడి లాగా ఉన్నాయి. వాటిని స్వీకరిస్తున్నాను. కేసీఆర్ బీజేపీతో బేరసారాలు చేసుకుంటున్నాడు. ఆత్మ ప్రబోధానుసారం బీఆర్ఎస్ నాయకులు నిర్ణయాలు తీసుకోవాలని రేవంత్ సూచించారు. కేసీఆర్ రాజకీయ జూదగాడు. కేసీఆర్ రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు ఇలాంటి కుట్రలు చేస్తూనే ఉంటాడు. ప్రపంచంలోనే అత్యంత అవినీతి పరుడు కేసీఆర్, ఆయనతో బీజేపీ స్నేహం ఎలా చేస్తోందంటూ రేవంత్ ప్రశ్నించారు. ఏపీలో ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటాం. ఏపీతో ఉన్న ఆస్తులు, నీటి పంపకాలను చర్చించి పరిష్కరించుకుంటామని రేవంత్ పేర్కొన్నారు.

### రాష్ట్రానికి సియం ను, మహబూబ్‌నగర్ కి కాదు


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా అయిన మహబూబ్‌నగర్ ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డిపై బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విజయం సాధించారు. తాజాగా.. మహబూబ్‌నగర్ ఫలితంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తాను జిల్లాకు ముఖ్యమంత్రిని కాదు రాష్ట్రానికి అని గుర్తుచేశారు. రాష్ట్రంలోని అన్ని స్థానాల్లో గెలుపు ఓటములకు తానే బాధ్యుడిని అని చెప్పారు. ముఖ్యంగా సొంత జిల్లా అయిన మహబూబ్‌నగర్ ఫలితానికి తానే బాధ్యత వహిస్తారని అన్నారు. ఇప్పుడు వచ్చిన ఫలితాలు ఉగాధి పండుగ లాంటివని అభిప్రాయపడ్డారు. తాను రాష్ట్రానికి పరిమితమైన నాయకుడిని అని.. నా బాధ్యత రాష్ట్రం మొత్తం ఉంటుందని అన్నారు.

## ప్రధానమంత్రి పదవికి నరేంద్ర
# మోదీ రాజీనామా
### వెంటనే ఆమోదించిన రాష్ట్రపతి



**టి మీడియా, జూన్ 5, ఢిల్లీ :** నరేంద్ర మోదీ బుధవారం (జూన్ 5) తన పదవికి రాజీనామా చేశారు. ఆయన రాష్ట్రపతి భవన్‌కు చేరుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా సమర్పించారు. అలాగే, 17 వ లోక్‌సభను రద్దు చేయాలని రాష్ట్రపతి ముర్ముకు సిఫారసు చేశారు మోదీ. రాష్ట్రపతి దీనిని అంగీకరించి, తాత్కాలిక ప్రధానమంత్రిగా కొనసాగాలని కోరారు. ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము మధ్య భేటీకి సంబంధించిన దృశ్యాలు వెలువడ్డాయి. ఢిల్లీలో ఎన్డీఏ సమావేశానికి ముందు ప్రధాని మోదీ తన రాజీనామాను అధ్యక్షుడు ముర్ముకు సమర్పించారు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన మోదీ, ఈ సాయంత్రం జరిగే ఎన్డీఏ కూటమి సమావేశంలో మరోసారి ఆయన్ను పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకుంటారు. 17 వ లోక్‌సభను రద్దు చేయాలని రాష్ట్రపతి ముర్ముకు సిఫారసు చేశారు మోదీ. జూన్ నెల 7వ తేదీన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకుంటారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎన్డీఏ కూటమికి 293 స్థానాలు, ఇండియా కూటమికి 263 స్థానాలు దక్కాయి. ఎన్డీఏ 272 సీట్ల మ్యాజిక్ ఫిగర్ దాటడంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కూటమి నేతలు కోరబోతున్నారు. జూన్ నెల 8వ తేదీన మరోసారి మోదీ దేశ ప్రధానిగా ప్రమాణం చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. నిజానికి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి 294 సీట్లతో మెజారిటీ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బీజేపీకి సొంతంగా మెజారిటీ రాలేదు. దీంతో ఎన్డీయే మిత్రపక్షాలు తప్పుకునే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాంటి పరిస్థితి వస్తే మళ్లీ ఎన్డీయే అధికారంలోకి రావడం కష్టమే. బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గురించే ఎక్కువగా చర్చ జరుగుతోంది. అయితే ఇరువురు నేతలు మాత్రం ఇప్పటికే ఎన్డీయేతోనే ఉంటామనే సంకేతాలు ఇచ్చారు. బుధవారం ఢిల్లీలో ఎన్డీయే సమావేశం జరగనుంది. ఇందులో పాల్గొనేందుకు దాని మిత్రపక్షాల ప్రముఖ నేతలు ఢిల్లీ చేరుకుంటున్నారు. నితీష్ కుమార్ కూడా ఢిల్లీ చేరుకున్నారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీకి బయలుదేరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటు, తదుపరి వ్యూహంపై చర్చించనున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ పూర్తిగా ధీమాగా ఉంది. ఈ కారణంగానే జూన్ 7న పార్లమెంట్ హౌస్‌లో ఎన్డీయే ఎంపీలందరితో సమావేశాన్ని ఏర్పాటు చేశాప్రధాని మోదీ అధ్యక్షతన ఈరోజు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశంలో ఎన్నికల ఫలితాలను సమీక్షించడంతో పాటు ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ప్రస్తుత లోక్‌సభను రద్దు చేయాలని కేబినెట్ సిఫార్సు చేసింది. దీనిపై లోతుగా చర్చించిన తర్వాతే ప్రధాని మోదీ రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్నారు.

# ప్రజల రుణం తీర్చుకుంటాం..
## - ఎన్డీఏతోనే మా ప్రయాణం..



- టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు


**టి మీడియా, జూన్ 5, విజయవాడ :** ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదు.. అహంకారం, నియంతృత్వం, విచ్చలవిడితనం.. ఏదిఅంటే అది చేస్తాననే ధోరణిని ప్రజలు తిరస్కరించారు.. అహంకారంతో వెళ్లే ఏ పాలకులకైనా ఇదే జరుగుతుంది.. అంటూ ఏపీలో కూటమి విజయంపై టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి విజయం అనంతరం ప్రెస్‌మీట్ నిర్వహించిన చంద్రబాబు.. రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు పలు విషయాలను కీలకంగా ప్రస్తావించారు. తన రాజకీయ చరిత్రలో.. ఈ ఐదేళ్ల చూసిన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదన్నారు ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి.. భావితరాల భవిష్యత్తు కోసం పాటుపడతాం.. అంటూ చంద్రబాబు పేర్కొన్నారు. రాజకీయాల్లో ఒడిదుడుకులు సహజం, ఎవరూ శాశ్వతం కాదు.. ఇంత చరిత్రాత్మకమైన ఎన్నికలు ఎప్పుడూ చూడలేదంటూ వ్యాఖ్యానించారు. తనతో సహా తమ అభ్యర్థులందరూ భారీ మెజార్టీతో గెలిచారన్నారు. భారీ మెజార్టీని ఏవిధంగా అభివర్ణించాలో తెలియడంలేదన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ వచ్చి ఓటు వేశారన్నారు. ఓడితే కుంగిపోలేదు..గెలిచినప్పుడు గంతులేయలేదని.. ప్రజల రుణం తీర్చుకుంటామంటూ చంద్రబాబు పేర్కొన్నారు. అహంకారం, నియంతృత్వం, విచ్చలవిడితనం.. ఏదంటే అది చేస్తాననే ధోరణిని ప్రజలు తిరస్కరించారని.. అహంకారంతో వెళ్లే ఏ పాలకులకైనా ఇదే జరుగుతుందని చంద్రబాబు అన్నారు. కార్యకర్తల త్యాగాల ఫలితమే ఈ విజయమన్నారు. కూటమికి బీజం వేసింది పవన్ కల్యాణే.. అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని..పవన్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమని చంద్రబాబు గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి సమానంగా పనిచేశాయంటూ వివరించారు.గత ప్రభుత్వం అప్పుల గురించి కూడా చంద్రబాబు మాట్లాడారు. ఎక్కడెక్కడ అప్పులు చేశారో తెలియదని, అన్ని గమనించాల్సి ఉందని తెలిపారు. గత అసెంబ్లీలో తనకు, తన భార్యకు, తన కుటుంబానికి జరిగిన అవమానాన్ని భరించలేకపోయానని చంద్రబాబు అన్నారు. తనపై బాంబులు వేసినప్పుడు కూడా అలా బాధపడలేదన్నారు. అప్పుడు సీఎంగానే వస్తానని ప్రతిజ్న చేశానని.. తన విజయానికి అందరూ తోడ్పాటునందించారని తెలిపారు. మూడు పార్టీలు సమిష్టిగా పనిచేశాయని చంద్రబాబు పేర్కొన్నారు.అయితే.. ఇండియా కూటమిలోకి వెళ్తున్నారా..? అని మిడియా అడిగిన ప్రశ్నపై చంద్రబాబు స్పందించారు.. తనకు రాజకీయ అనుభవం చాలా ఉందని .. ఎన్నో ఒడిదుడుకులను చూశామంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి ఎన్డీఏతో ఉన్నామని.. ఎన్డీఏతోనే తమ ప్రయాణమన్నారు. ఈరోజు ఎన్డీఏ సమావేశానికి హాజరవుతున్నామని.. ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత అన్ని వివరిస్తానని చంద్రబాబు తెలిపారు.

## వేతనాల పెంచాలని నైజీరియా కార్మికుల నిరసనలు

**టి మీడియా, జూన్ 5, అబుజా :** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నైజీరియా కార్మికులు దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. ఈ నిరసన కారణంగా విమాన రవాణా, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా దేశంలోని అతి ముఖ్యమైన ముర్తాలా మహమ్మద్ అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తిగా స్తంభించిపోయింది. దేశ ద్రవ్యోల్బణం మరియు ఆర్థిక సంక్షోభం జీవన వ్యయాన్ని పెంచాయి. కానీ కార్మికులకు వేతనాలు మాత్రం పాతాళానికి పడిపోతున్నాయి. ఈ సందర్భంలో దేశంలోని కార్మికులు జీవన సంక్షోభాలను ఎదుర్కోవటానికి కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. "మేము జీవన వేతనాన్ని డిమాండ్ చేస్తున్నాము" అని నైజీరియన్ లేబర్ కాంగ్రెస్ తెలిపింది. అంతేకాదు ప్రస్తుతం మన కార్మికులు ఆకలి చావులు అందుకుంటున్నారని లేబర్ కాంగ్రెస్ దేశ కార్మికుల పరిస్థితిని వివరించింది. ఈ వేతనంతో కార్మికులు బతకలేని పరిస్థితి నెలకొంది. జీవన స్థితిగతులను మెరుగుపరచాలని వేతనాలు పెంచాలని కోరుతూ కార్మికులు ఒక్కతాటిపైకి వచ్చి దేశవ్యాప్త సమ్మె చేపట్టారు. నైజీరియన్ లేబర్ కాంగ్రెస్ మరియు ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఈ పోరాటాన్ని సమన్వయం చేయడానికి నైజీరియా అంతటా కార్మికులను ఏకం చేశాయి. నైజీరియాలో కార్మికులకు ప్రస్తుత నెలవారీ వేతనం 30,000 నైరా (రూ. 1,693) మాత్రమే.దేశ ప్రభుత్వం రెండుసార్లు పెంచుతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేరలేదు. ఈ పరిస్థితిలో వేతనాలను రెట్టింపు చేయడం కూడా ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి సహాయపడదు. అందువల్ల నెలకు 4 లక్షల 94 వేల నైరా (రూ. 27,840) అందించాలనే డిమాండ్ తో రెండు యూనియన్ కాంగ్రెస్ లు పోరాడుతున్నాయి.

# టార్గెట్ ట్వంటీ ట్వంటీ ఎయిట్

## -కమలానికి పెరిగిన ఓట్లు..



**టి మీడియా, జూన్ 5, హైదరాబాద్:** తెలంగాణలో కదనోత్సాహంతో ఉంది కమలదళం. అధికారమే తరువాయి అంటూ ట్వంటీ ట్వంటీ ఎయిట్ టార్గెట్ పెట్టుకుంది. రాష్ట్రంలో ఎన్నిక ఎన్నికకీ ఓట్లు, సీట్లు పెంచుకుంటున్న బీజేపీ.. డబుల్ డిజిట్ కాకపోయినా గతకంటే డబుల్ ఎంపీ సీట్లలో విజయబావుటా ఎగురవేసింది. 8 ఎంపీ స్థానాలతో అధికార కాంగ్రెస్ పార్టీకి దీటైన పోటీ ఇచ్చింది. ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగాం.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు చేపడతామన్న ధీమాతో వ్యూహాలకు పదునుపెడుతోంది కాషాయ పార్టీ.తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ అంచనాలకు తగ్గట్లే పర్‌ఫామ్ చేసింది. డబుల్ డిజిట్ సీట్లు టార్గెట్‌గా బరిలోకి దిగిన రాష్ట్ర నాయకత్వం ఆ మేజిక్ సాధించలేకపోయినా.. గతంకంటే రెట్టింపుసీట్లుగెలిచి రాష్ట్రంలో ప్రత్యామ్నాయశక్తిగాని రూపించుకుంది. గతంలో ఒక అసెంబ్లీ స్థానంతో పాటు నాలుగు ఎంపీ సీట్లు గెలుచుకున్న బీజేపీ.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 8 అసెంబ్లీస్థానాలతో పాటు.. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధికారపార్టీతో సరిసమానంగా 8 ఎంపీ సీట్లు గెలిచింది. దీంతో తాము కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయ శక్తిగా నిలిచామని, ఇక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పగ్గాలు తమ చేతికొస్తాయన్న ధీమా బీజేపీలో కనిపిస్తోంది.పెరిగిన సీట్లతో పాటు ఓట్ల శాతం కమలం శ్రేణుల్లో జోష్ నింపింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యే స్థానాలు దక్కకపోయినా..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోరాటపటిమ చూపించి తెలంగాణలో బీజేపీ మరింత పట్టు సాధించింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి 7 శాతం ఓట్లొస్తే ఒకే ఒక్క ఎమ్మెల్యే గెలిచారు. ఏడాదితిరిగేలోపే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి 19 శాతం ఓటింగ్‌తో ఆ పార్టీ నుంచి ఏకంగా నలుగురు ఎంపీలు గెలిచారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 14 శాతం ఓట్లు సాధించిన బీజేపీ నుంచి 8 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి అడుగుపెట్టారు. ఈ లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓటింగ్ ఏకంగా 35 శాతానికి పెరిగింది. ఆ పార్టీనుంచి ఎనిమింది ఎంపీలు గెలిచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని బీజేపీ నాయకత్వం ప్లాన్ చేస్తోంది.రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన గత బీఆర్ఎస్ పాలననే తలపిస్తోందని.. హామీల అమలులో ఇప్పటికే కాంగ్రెస్ వైఫల్యం చెందిందని ఆరోపిస్తున్నారు బీజేపీ నేతలు. హామీల అమలుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో కూడా చెప్పలేని స్థితిలో కాంగ్రెస్ సర్కారు ఉందని కమలం నేతలు టార్గెట్ చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఊపుతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లక్ష్యం సాధించే దిశగా కార్యాచరణ రూపొందించుకునేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అగ్ర నాయకత్వం కూడా దక్షిణాదిపై ఫోకస్ పెట్టడంతో.. కేంద్రంలో కొలువుదీరనున్న ఎన్డీయే సర్కారులో రాష్ట్ర బీజేపీ ఎంపీలకు రెండు మూడు కేంద్రమంత్రి పదవులు దక్కే అవకాశం కనిపిస్తోంది.

బీఆర్ఎస్ పాలనను టార్గెట్ చేసి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలనుకుంది బీజేపీ. అయితే ఆశించిన స్థాయిలో ఎమ్మెల్యేలు గెలవకలేపోయినా .. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావమే చూపింది. ఈ ఫలితాలతో రానున్న కాలం తమదేనని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్న నమ్మకంతో ఉంద బీజేపీ నాయకత్వం. అధికార పగ్గాలు చేపట్టి తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామని ఇప్పటినుంచే ధీమా వ్యక్తంచేస్తున్నారు కమలనాథులు.

# ఓటమిపాలైన కేంద్ర మంత్రులు

## -కేబినెట్‌కు దూరమైన హేమాహేమీలు!



**టి మీడియా, జూన్ 5,న్యూఢిల్లీ:** ఈ ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. పరాజయం పాలవకపోయినా మోదీ మ్యాజిక్ ఈ సారి వర్కౌట్ కాలేదు. అందుకు కారణం అగ్ర నేతలుగా పేరుగాంచిన కేంద్ర మంత్రులు ఘోర పరాజయం పాలవడమే. ముఖ్యంగా మోదీ మంత్రి వర్గంలో కీలక పదవుల్లో మంత్రులుగా కొనసాగిన స్మృతి ఇరానీ, అర్జున్ ముండా, అజయ్ మిశ్రా తేనీలు, రాజీవ్ చంద్రశేఖర్‌లతో సహా పలువురు ప్రముఖ నేతలు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలవడం తీవ్ర నిరాశకు గురిచేసింది.

### ఓడిపోయిన కేంద్ర మంత్రులు వీరే..

అమేథీ నుంచి పోటీ చేసిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ కాంగ్రెస్ నేత కిశోరీ లాల్ శర్మ చేతిలో 1,67,196 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో ఇదే స్థానం నుంచి రాహుల్ గాంధీపై విజయం సాధించిన ఆమె ఈసారి అనూహ్య రీతిలో ఓడిపోయారు.జార?ండ్‌లోని ఖుంటి లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసిన కాంగ్రెస్ అభ్యర్థి కాళీచరణ్ ముండా చేతిలో కేంద్ర గిరిజన వ్యవహారాలు, వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా 1,49,675 ఓట్ల తేడాతో ఓడిపోయారు.కేంద్ర హోంశాఖ సహాయమంత్రి అజయ్ మిశ్రా తేని లకింపుర్ ఖేరి ఘటన వివాదంలో పీకల్లోతు ఇరుక్కుపోయారు. ఇదే ఆయన్ని సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఉత్కర్ష్ వర్మ చేతిలో ఆయన 34 వేల ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యేలా చేసింది.వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రిగా చేసిన కైలాశ్ చౌదరీ రాజస్తాన్‌లోని బార్మర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అదే స్థానం నుంచి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ఉమ్మెద రామ్ బెనివాల్ చేతిలో 4.48 లక్షల ఓట్ల తేడాతో ఓడిపోయారు.

కేంద్ర మంత్రి ఆర్కే సింగ్.. బీహార్‌లోని అర్రాలో సీపీఐఎంఎల్‌కు చెందిన సుదామ ప్రసాద్‌పై 59,808 ఓట్ల తేడాతో ఓడిపోయారు.కేరళలోని తిరువనంతపురం నుంచి పోటీ చేసిన ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ సహాయ మంత్రిగా పనిచేసిన రాజీవ్ చంద్రశేఖర్ కాంగ్రెస్ దిగ్గజ నేత శశిథరూర్ చేతిలో 16వేల ఓట్ల తేడాతో చిత్తుగా ఓడారు.కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి మహేంద్ర నాథ్ పాండే .. యూపీలోని చండౌలీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.హౌజింగ్, అర్బన్ అఫైర్స్ శాఖ మంత్రి కౌశల్ కిషోర్ మోహన్‌లాల్‌గంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి సమాజ్‌వాదీ నేత ఆర్కే చౌదరి చేతిలో 70వేల ఓట్ల తేడాతో పోడిపోయారు.కన్స్యూమర్ అఫైర్స్, ఫుడ్, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి యూపీలోని ఫతేపుర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.రైల్వేశాఖ సహాయ మంత్రి రావు సాహెబ్ దాన్వే .. మహారాష్ట్రలోని జాల్నా స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చెందారు.కేంద్ర మంత్రి సంజీవ్ బాల్యన్.. ముజాఫర్‌నగర్ లోక్‌సభ సీటు నుంచి పోటీచేసి ప్రత్యర్థి ఎస్పీ నేత హరీంద్ర సింగ్ మాలిక్‌పై 24 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.విదేశాంగ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వీ మురళీధరన్ కూడా ఓన్నికల్లో ఓడిపోయారు.ఫిషరీస్, యానియల్ హజ్‌బెండరీ, డెయిరీ శాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్.. డీఎంకే నేత ఏ రాజా చేతిలో 2 లక్షల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.హోంశాఖ సహాయ మంత్రి నిషిత్ ప్రామానిక్.. బెంగాల్‌లోని కూచ్ బిహార్ నుంచి పోటీచేసి టీఎంసీ నేత జగదీశ్ చంద్ర బాసునియా చేతిలో 39వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్.. బంకురా లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి, టీఎంసీ నేత అరూప్ చక్రవర్తిపై 32 వేల ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు.

# ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను ఖండించిన

## జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్

**టీ మీడియా, జూన్ 5, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ నిన్న వనపర్తి రాజీవ్ చౌక్ లో వనపర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని ఇంటి దొంగల వల్ల వనపర్తి నియోజకవర్గం లో మెజార్టీ తగ్గిందని ఆరోపించడం జరిగింది.వనపర్తి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి బయటి నుండి వచ్చి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు తెలియనివాళ్ళు 20,30 సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన వారిని ఇంటి దొంగలు ఇంటి దొంగలను నిందారోపణలు చేయడం ఎంత వరకు సమంజసం. మీ పక్కనే ఉన్న కొంతమంది బయటి దొంగలు కాంగ్రెస్ పార్టీలో చేరి 20, 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిపై ఇలా విమర్శించడం సబబు కాదు. ఎమ్మెల్యే ఎన్నికలలో మీకోసం జిల్లా అధ్యక్షులుగా నేను, జిల్లెల చిన్నారెడ్డి ఎంతో కష్టపడి పార్టీ కోసం మీ గెలుపు కోసం పని చేయలేదా ? భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న నిజాయితీగల కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా చూడాలి.



వనపర్తి ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో ఇంటి దొంగలు అన్న మాటలను వాపసు తీసుకోవాలి అని డిమాండ్ చేయడం జరిగింది.ఎమ్మెల్యే పార్టీ కోసం ఎవరు పని చేస్తున్నారు ఎవరు చేయట్లేదు మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్న నాయకులు ఎవరని గుర్తించాలి. మనమందరం కలిసి వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తూ రాబోవు స్థానిక సంస్థలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకై పని చేయాలి తప్ప ఇలా ఇతరులపై విమర్శలు చేయడం మానుకోవాలి.వనపర్తి ఎమ్మెల్యే సొంత మండలం అయిన పెద్దమందడిలో బిజెపికి 772 ఓట్లు లీడ్ రావడం జరిగింది.

వనపర్తి పట్టణంలో బిజెపికి 1972 ఓట్లు లీడ్ రావడం జరిగింది.గణపురం మండలంలో బిజెపి పార్టీకి 1007 ఓట్లు లీడ్ రావడం జరిగింది.పెబ్బేరు పట్టణంలో బిజెపి పార్టీకి 823 ఓట్లు లీడ్ రావడం జరిగింది.వనపర్తి మండలంలో 1669, పెబ్బేరు మండలంలో 1960, శ్రీరంగాపురం మండలంలో 809, రేవల్లి మండలంలో 980, గోపాల్పేట మండలంలో 490 వారిగా ఓట్లు కాంగ్రెస్ పార్టీకి లీడ్ రావడం జరిగింది.

రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఇంటి దొంగలు అని ఎమ్మెల్యే గారు అంటున్నారు కాంగ్రెస్ పార్టీలోనే కొందరు పెద్దలు నాయకులు ఎమ్మెల్యే పై చెప్పమని ఒత్తిడి తెచ్చి చెప్పించడం జరుగుతుంది.ఎవరు అనేది ఇంటి దొంగలని జిల్లా అధ్యక్షునిగా నేను ఎమ్మెల్యేగా మీరు కూర్చొని ఎవరు తప్పు చేశారో అంతర్గతంగా చర్చించుకుని సమీక్ష చేసుకోవాల్సి ఉంటుంది.మీరు నిన్న రాజీవ్ చౌక్ లో బహిరంగంగా మాట్లాడడం వల్ల బాధ కలిగి ఈ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.

వనపర్తి మున్సిపల్ చైర్మన్ ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందే కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగింది వనపర్తి పట్టణ ప్రథమ పౌరుడై ఉండి కూడా తన వార్డులో 550 ఓట్లు బిజెపి పార్టీకి లీడు రావడం జరిగింది.బయటి దొంగలు ఎమ్మెల్సీ ఎన్నికల కంటే ముందు వచ్చి గోవాలో ప్రమాణాలు చేసి బిఆర్ఎస్ తప్ప ఎవరికి ఓటు వెయ్యము అని చెప్పిన నాయకులు ఇంటి దొంగలని చెప్పడం మంచి పద్ధతి కాదని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో మీకోసం పనిచేసిన కాంగ్రెస్ పార్టీలో ఉన్న కౌన్సిలర్లను మున్సిపాలిటీ చైర్మన్ గా, మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎందుకు చేయలేదు అడుగుతున్నాం.మీరు కొంతమంది నాయకులకే ఎమ్మెల్యే కాదు వనపర్తి నియోజకవర్గం ప్రజలకు అందరికీ కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎమ్మెల్యేగా మేము అదే విధంగా భావిస్తూ గౌరవిస్తున్నాం. ఏఐసిసి స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఇరవై వేలు , జిల్లా అధ్యక్షులు గా నేను ముప్పై వేల పాంప్లెట్లు స్వతహాగా ముద్రించడం జరిగింది. వాటిని నియోజకవర్గం మొత్తం ఓటర్లకు పంచడం జరిగింది అని విలేకరుల సమావేశంలో మాట్లాడటం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నారాయణ, పెంటన్న, రాములు యాదవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దివాకర్, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకిరాములు, ఎల్లయ్య, బాబా, అసెంబ్లీ సోషల్ మీడియా కో కోఆర్డినేటర్ గడ్డం వినోద్, రాంచందర్, రామరాజు, మద్దిలేటి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్తా: సీఎం రేవంత్‌రెడ్డి

**టి మీడియా, జూన్ 5,హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి గెలుపుపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ఆహ్వానిస్తే ప్రమాణస్వీకారానికి తప్పకుండా వెళ్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకే తాను నడుచుకుంటానన్నారు. ఏపీలో ఏ ప్రభుత్వం వచ్చినా సామరస్యంగానే రాష్ట్ర సమస్యలు పరిష్కరించుకుంటామని గతంలోనే చెప్పినట్లు గుర్తు చేశారు. ఏపీ ప్రత్యేక హోదా చట్టబద్ధతతో కూడుకున్న హామీ అన్నారు. రాహుల్ గాంధీ విస్పష్టంగా ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడానికి కట్టుబడి ఉన్నారని చెప్పారు. ఈ విషయంపై తమ పార్టీలో చర్చించాక చంద్రబాబుతో మాట్లాడతామని రేవంత్ తెలిపారు.

## ఎమ్మెల్యే కి మహానందీశ్వరుని ప్రసాదాలు అందజేత..

**టీ మీడియా, జూన్ 05, మహానంది:** మహానంది దేవస్థానం తరపున శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,వేద పండితులు రవిశంకర అవధాని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని ఆలయ ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు, వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని కలిసిన దినేష్

**టీ మీడియా, జూన్5, గోదావరిఖని ప్రతినిధి:** గత మార్చి నెలలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా ఏ రవీందర్ రెడ్డి గెలిచిన సందర్భంగా హై కోర్టు ఆవరణలో తన ఛాంబర్ లో బుధవారం ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు సీనియర్ అడ్వకేట్ సావన్ చక్రవర్తి ,గంగాధర్ ఉన్నారు.



## దశదినకర్మ సంతాప సభలో నివాళులు అర్పించిన మాజీమంత్రి నిరంజన్ రెడ్డి

### ౦ మాజీ ఎం.పి రావుల

**టీ మీడియా, జూన్ 5, వనపర్తి బ్యూరో :** హైదారాబాద్ హోటల్ దాసపల్లా నందు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా మాజీ నీటిపారుదల ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వ సలహాదారు రంగారెడ్డి దశదినకర్మ జరిగింది.ఇట్టి కార్యక్రమములో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి , రావుల.చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని రంగారెడ్డి కి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల నిర్మాణంలో రంగారెడ్డి కృషి మరువలేనిదని పాలమూరు రైతుల భవిష్యత్తు కోసం లక్షలాది ఎకరాలకు శాశ్వత సాగునీరు అందించిన ఘనత కె.సి.ఆర్ దయితే వారికి సలహాలు సూచనలు ఇస్తూ నిర్ణీతకాలములో ప్రాజెక్టులు అందించిన ఘనత రంగారెడ్డి దని అన్నారు.శాశ్వత తాగు,సాగు నీరు అందించి ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.వారి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చి వారి కుటుంబానికి మనోనిబ్బారాణి ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమములో జిల్లా మాజీ ఎం.ఎల్.ఎలు అధికారులు పాల్గొన్నారు.



## అక్రమ లాండ్ గ్రాబ్బింగ్ కు పాల్పడుతున్న ముఠా అరెస్టు

### -పోలీసుల అదుపులో 10 మంది నిందితులు

### -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**టి మీడియా,జూన్ 5,సంగారెడ్డి:** జిల్లా పోలీసులు అక్రమ లాండ్ గ్రాబ్బింగ్ కు పాల్పడుతున్న ముఠా గుట్టును రట్టు చేశారు. ఆ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ.. మే 26న హైదరాబాద్ చెందిన పెండ్యాల హరినాద్ బాబు సర్వే నెం.198, 251లలో గత భూమిలోకి అక్రమంగా ప్రవేశించారన్నరు.అత్రియ స్మార్ట్ రియల్ కంపెనీ కార్మికులైన గణపతి రాజు శ్రావణ్ వర్మ అలియాస్ శ్రవణ్, గట్టుముక్కల భరత్ వర్మ, పి.అశోక్ రెడ్డి, పాషా, వారి స్నేహితుడైన అఖిల్, 10మంది కిరాయి మనుషులను తీసుకెల్లి ఆ భూమిలో తల్వార్ కత్తులు, కట్టెలతో అక్కడున్న వారిని, పనిచేస్తున్న వారిపై దౌర్జన్యం చేస్తూ బూతుమాటలు తిడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారన్నారు. చంపుతామని బెదిరించి, అక్కడి నుంచి వెళ్లగొట్టి జేసీబీల సహాయంతో భూమి చుట్టూ వేసిన సుమారు 800 ఫెన్సింగ్ కడ్డీలను విరగ్గొట్టి డ్యామేజ్ చేశారన్నారు.గాడిపర్తి రవీందర్ బాబు, కూకట్ పల్లి, హైదరాబాద్ మునిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన మునిపిల్లి పోలీసులు కేసు పూర్వపరాలను విచారించి ఎస్పీ చెన్నూరి రూపేష్, మునిపల్లి ఎస్ఐ సురేష్, సిబ్బంది అందరూ కలిసి చాకచక్యంగా వ్యవహరించి కిరాయి మనుషులను, యం.ఆర్.యస్ వర్మ దగ్గర పనిచేస్తున్న గణపతి రాజు శ్రావణ్ వర్మ అలియాస్ శ్రవణ్ లు కిరాయి మనుషులను ఏర్పాటు చేసిన ఆనంద రావు ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనున్నట్లు తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమంచి ల్యాండ్ గ్రాబింగ్ కు పాల్పడినా, ల్యాండ్ యజమానులకు బెదిరించినా, కిరాయి మనుషులతో లాండ్ లోకి ఆక్రమంగా ప్రవేశించినా దౌర్జన్యం చేసి ప్రజాశాంతికి భంగం కలిగంచినా చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే రౌడీ షీట్స్ ఓపెన్ చేసి, పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



## పలువురు ప్రభుత్వ సలహాదారులు రాజీనామా

**టి మీడియా,జూన్ 5,అమరావతి:** అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ఘోరంగా ఓడిపోవడంతో పలువురు ప్రభుత్వ సలహాదారులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డితో సహా 20 మందికి పైగా సలహాదారులు తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లుగా సీఎస్ జవహర్‌రెడ్డికి లేఖలు పంపారు. కాగా ఫలితాలు వెలువడిన వెంటనే టిటిడి ఛైర్మన్ పదవికి భూమన కరుణాకర్‌రెడ్డి రాజీనామా చేశారు. జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు ఇప్పటికే తమ రాజీనామా లేఖలు సమర్పించారు.



## ఎమ్మెల్యే కి మహానందీశ్వరుని ప్రసాదాలు అందజేత..

**టీ మీడియా, జూన్ 05, మహానంది:** మహానంది దేవస్థానం తరపున శ్రీశైలం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి,వేద పండితులు రవిశంకర అవధాని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ని ఆలయ ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు, వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



## అవిశ్వాసానికి తాత్కాలిక బ్రేకులు

### పీర్జాదిగూడ:లో అవిశ్వాసానికి తాత్కాలిక బ్రేకులు

**టి మీడియా,జూన్ 5,పీర్జాదిగూడ:**లో అవిశ్వాసానికి తాత్కాలిక బ్రేకులు పడ్డాయి. తమకు మాయమాటలు చెప్పి, కౌన్సిల్ కు సంబంధించిన తీర్మానం లో సంతకాలు చేయించుకొని, అ సంతకాలు అవిశ్వాసానికి వాడుకున్నారని, కొందరు కార్పొరేటర్లు కోర్టు కు వెళ్లారు.తర్వాత మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో మేయర్ పై చీటింగ్ కేసు పెట్టారు. ఈ కారణాలన్నీ కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా కలెక్టర్ పీర్జాదిగూడలో అవిశ్వాసం తాత్కాలికంగా నిలిపివేయాలని కమిషనర్ కు ఉత్తర్వులు అందజేశారు. దీంతో బుధవారం జరగవలసిన అవిశ్వాసానికి బ్రేకులు పడ్డాయి. కమిషనర్ త్రిలేశ్వర్ రావు మాట్లాడుతూ.. సంబంధిత కార్పొరేటర్లకు కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు అందజేశామని, మరలా అవిశ్వాసం ఎప్పుడన్నది తదుపరి కలెక్టర్ ఉత్తర్వులపై ఆధారపడి ఉంటుందని కమిషనర్ తెలిపారు. అవిశ్వాసం బ్రేకులు పడడంతో బ్యాంకాక్ టూర్ లో ఉన్న మేయర్ టీం గురువారం తిరిగి పీర్జాదిగూడకు రానుంది.





## ముగిసిన ఎన్డీఏ కూటమి సమావేశం..

### -ప్రభుత్వ ఏర్పాటుపై కీలక చర్చ..


### -అండగా నిలిచిన బాబు, నితీశ్

**టి మీడియా,జూన్ 5,ఢిల్లీ :**లోని నరేంద్ర మోదీ నివాసంలో ఎన్డీ?యే కూటమి సమావేశం ముగిసింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై కూటమి పార్టీలు సుదీర్ఘంగా చర్చించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సీనియర్ నేతలు అమిత్‌షా, నితిన్ గడ్కరీ ఈ భేటీకి హాజరయ్యారు. కూటమి పార్టీల తరఫున జేడీయూ నుంచి నితీశ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నుంచి చంద్రబాబు నాయుడు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఏర్పాటుపైనా ముఖ్య నేతలంతా చర్చించారు. ఎన్నికల ఫలితాలపై పాటుగా తాజా రాజకీయ పరిస్థితులపై నేతలు చర్చించారు. మరోవైపు.. రాష్ట్రపతిని కలిశారు ఎన్డీఏ పక్ష నేతలు. రాష్ట్రపతిని కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. ఇక జూన్ నెల 8న కర్తవ్య పథ్‌లో ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేయనున్నారు నరేంద్ర మోదీ.బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి వరుసగా మూడవసారి అధికారాన్ని పొందేందుకు సిద్ధంగా ఉంది. లోక్‌సభ ఫలితాలను బట్టి చూస్తే, నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 291 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంది.




## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.

**టీ మీడియా, జూన్5, గోదావరిఖని ప్రతినిధి:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం నుండి గోదావరిఖని చౌరస్తా వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు విరివిగా మొక్కలు నాటడం, నీటి సంరక్షణ చర్యలు చేపట్టడం, నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగించకుండా ఉండడం, వంటి చర్యలు ప్రతి ఒక్కరు చేపట్టాలని కోరారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రామగుండం ప్రాంతీయ కార్యాలయం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బిక్షపతి మాట్లాడుతూ నేల పునరుద్ధరణ ఎడారి కరణ కరువును తట్టుకోవడం అనే థీమ్ తో ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడు పర్యావరణ దినోత్సవము నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. చెట్లు పెంచడం, అడవులు నరకకుండా చూడటం, నీటి పొదుపు, ప్లాస్టిక్ నిషేధం అమలుపరచడం పై అవగాహన పెంపొందించడం, ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గ్రామంలో నగరపాలక సంస్థ సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2024 పర్యావరణ దినోత్సవం థీమ్ తో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్ను ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణహితంగా తయారుచేసిన జనప నారా సంచులను ప్రదర్శించే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పర్యావరణ విభాగం అధికారులు సురేష్ బాబు రాజిరెడ్డి కిషోర్ ఎన్ టి పి సి అధికారి, విశాల్ ఆర్ ఎఫ్సి ఎల్ అధికారులు, సత్యనారాయణ దీపక్షామ్యం, జిపిపిపిజి అధ్యక్షులు, భీమ్ సేన్ తదితరులు పాల్గొన్నారు.



## గుండె నొప్పి తో యువకుని మృతి

**టి మీడియా,జూన్ 5,నిజామ్ భాద్ :** అప్పటివరకు కుటుంబ సభ్యులతో, తోటి స్నేహితులతో సరదాగా గడిపిన ఆ యువకుడు అకస్మాత్తుగా వచ్చిన గుండె నొప్పితో మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సరదాగా క్రికెట్ ఆడటానికి వెళ్తే ఆ ఆటే తనకు చివరి ఆటగా మిగిలింది. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమ్ నగర్ కు చెందిన విజయ్(30) సరదాగా స్నేహితులతో కలిసి నిజామాబాద్ నగరం లోని వినాయక నగర్ లో గల అమ్మ వెంచర్ లో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. అక్కడ క్రికెట్ ఆడుతూ ఒక్కసారిగా కుప్ప కూలడంతో స్నేహితులు హుటాహుటిన నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. దీంతో కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది.



## రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నము

**-చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుశుభాకాంక్షలు**

**-ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల**



**టి మీడియా,జూన్ 5,విజయవాడ :** ఏపీ ఎన్నికల్లో ఓటమిపై స్పందించినఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల బుధవారం విజయవాడ లో మీడియాతోమాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు , జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కు ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు.ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఏపీకి ప్రత్యేక హెూదా రావాలని, పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు.అలాగే ఏపీకి రాజధాని నిర్మాణం జరగాలని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా సాగాలని, ప్రజలు ఇచ్చిన ఇంత పెద్ద మెజారిటీతో ముందుకు అడుగు వేయాలని షర్మిల అన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచన చేసి, ప్రత్యేక హెూదా కోసం కట్టుబడాలని, అన్ని విభజన హామీలకు కేంద్రం కట్టుబడాలని.. అలా అయితేనే కేంద్రానికి మద్దతు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూ, జనం గొంతుకగా మారిన కాంగ్రెస్ పార్టీ, ఇక మీదట కూడా రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రభుత్వ నిర్లక్ష్యాలను ఎండగడుతుందని షర్మిల స్పష్టం

## సైన్యంలోకి విదేశీయులను చేర్చుకుంటాం : ఆస్ట్రేలియా



**టి మీడియా, జూన్ 5,కాన్ బెర్రా :** విదేశీయులను సైన్యంలోకి చేర్చు కోవాలని ఆస్ట్రేలియా నిర్ణయిం చింది. రిక్రూట్ మెంట్ లక్ష్యాన్ని చేరుకోలేక సతమతమవుతున్న ఆస్ట్రేలియా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో 12 నెలలు నివసించిన విదేశీ పౌరులు ఎవరైనా ఆస్ట్రేలియన్ ఆర్మీలో సేవ చేయవచ్చునని తెలిపారు. బ్రిటన్, కెనడా, న్యూజిలాండ్ మరియు యునైటెడ్ స్టేట్స్ నుండి పౌరులు సైన్యంలో చేరాలని ఆయన ఆహ్వానించారు. ఆస్ట్రేలియా తన సముద్ర సరిహద్దుల చుట్టూ పెరుగుతున్న ఉద్రిక్తతలను ఎదుర్కోవడానికి జలాంతర్గాములు, అల్ట్రా-ఆధునిక యుద్ధ విమానాలు మరియు సైనిక వాహనాలను కొనుగోలు చేస్తోంది. అయితే వీరిని మెయింటెయిన్ చేసేందుకు, దేశ సైన్యాన్ని బలోపేతం చేసేందుకు సైనికుల కొరత ఉంది. ఈ కొరతను తీర్చేందుకు ఇప్పుడు విదేశీ పౌరులను నియమించుకోవాలని నిర్ణయించింది.

## ఎన్నికల ఫలితాలు బిజెపికి గట్టి దెబ్బ : కేరళ సిఎం



**టి మీడియా, జూన్ 5,కేరళ :** ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను ధ్వంసం చేసేలా బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు 2024 లోక్‌సభ ఫలితాలు గట్టి దెబ్బ అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ బుధవారం అన్నారు. కాషాయ పార్టీకి అనుకూలంగా చేసిన ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై విజయన్ స్పందిస్తూ మతతత్వాన్ని ఉపయోగించి ముందుకు సాగాలన్న బిజెపి ఎత్తులను భారత ప్రజలు విచ్ఛిన్నం చేశారని అన్నారు. త్రిసూర్‌లో బీజేపీ విజయాన్ని చాలా సీరియస్‌గా చూస్తున్నామని, దీనిపై సమీక్ష చేయనున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.


## పొత్కపల్లి గ్రామంలో చిరుత సంచారం!

**- సీసీ పుటేజ్ కి చిక్కిన విజువల్స్**



**టి మీడియా, జూన్ 5,ఓదెల:** మండలంలోని పొత్కపల్లి గ్రామంలోని రైల్వే గేట్ 29 సమీపంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది. వివరాల్లోకి వెళితే పొత్కపల్లి గ్రామంలోని ఖలీల్ తన ఇంటి సమీపంలో సీసీ కెమెరాలను అమర్చుకోగా ఖలీల్ పెంచుకుంటున్న పెంపుడు పిల్లి కనపడకపోవడంతో సిసి పుటేజ్ ని చూస్తుండగా చిరుత పులి సంచరిస్తున్న విజువల్స్ బయటపడ్డాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించగా పొత్కపల్లి ఎస్సై అశోక రెడ్డి అందుబాటులో లేకపోవడంతో తన పోలీస్ సిబ్బందిని సంఘటన స్థలాన్ని పరిశీలించమని పంపగా సి సి ఫుటేజ్ ని పరిశీలించి ఎస్ఐ అశోక్ రెడ్డికి సమాచారం అందించారు. సిబ్బంది ఇచ్చిన సమాచారంతో పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ఫారెస్ట్ అధికారులతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు ఎస్ఐ అశోక్ రెడ్డి తెలిపారు. ఫారెస్ట్ అధికారులు వస్తే చిరుతకు సంబంధించిన పూర్తి సమాచారం ఏం తెలుస్తుందో వేచి చూడాలి.

## పిడుగుపాటుకు రైతు మృతి..




**టి మీడియా,జూన్ 5,మల్హర్ రావు:** ప్రమాదవశాత్తు పిడుగుపాటుతో నేరేదు కొమ్మ మలహల్ రావు (52) అనే రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల, కుటుంబ సభ్యుల పూర్తి కథనం ప్రకారం మలహల్ రావు సాయంత్రం తన పామాయిల్ తోట వద్దకు పశు వులు రాకుండా చూస్తానని వెళ్లినట్లుగా తెలిపారు. అయితే అకాల ఈదురు గాలి బీభత్సం తోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం తగ్గింపై, రాత్రైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యయలు పామాయిల్ తోట వద్దకు వెళ్లి వెతుకుతుండగా తోటలో శవమై కనిపించినట్లుగా కన్నీరుమున్నీరైయ్యారు. చలిపిడుగు వేయడంతో అక్కడికక్కడే చనిపోయినట్లుగా పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో బాధిత కుటుంభం రోడ్డున పడింది.ఆర్థికంగా మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## హైదరాబాద్‌లో దంచికొట్టిన వాన..

**నీటమునిగిన రహదారు**

**టి మీడియా, జూన్ 5,హైదరాబాద్, జూన్ 5:** హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో



బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం నగరమంతా దంచికొడుతోంది. ఉదయమంతా ఎండ వేడికి అల్లాడిన జనం వర్షం జల్లులతో సేద తీరారు. ఎల్‌బీనగర్, హయత్‌నగర్, గచ్చిబౌలి, మాదాపూర్, మియాపూర్, కొండాపూర్, లింగంపల్లి, కూకట్‌పల్లి, ఎర్రగడ్డ, పంజాగుట్ట, శిల్పారామం, కొండాపూర్, హైటెక్ సిటీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, ట్యాంక్‌బండ్, లిబర్టీ, హిమాయత్‌నగర్, బషీర్‌బాగ్, నాంపల్లి, అబిడ్స్, పాతబస్తీ, చాంద్రాయణ గుట్ట, ఫలక్‌నుమా, బార్కస్, ఎల్బీనగర్, వనస్థలిపురం, మెహిదీపట్నంతో పాటు పలు ప్రాంతాల్లో మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది.

- ఓటమికి కారణం అంతుచిక్కడం లేదు
- ప్రజల కోసం పనిచేస్తాం...
- జిల్లా వైసిపి అధ్యక్షుడు జక్కంపూడి రాజా

# ఎంతో అభివృద్ధి చేశా .. నిత్యం ప్రజలతోనే ఉన్నా..



**టి మీడియా,జూన్ 5,రాజమహేంద్రవరం:** రాజానగరం నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేనిరీతిలో అభివృద్ధి చేసాం. అర్హులకు పథకాల లబ్ది నేరుగా ఖాతాల్లో జమచేయించాం. అనునిత్యం ప్రజలతో మమేకమై, వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకున్నాం. చివరకు కన్నతల్లికి ఒంట్లో బాగోలేక ఆసుపత్రిలో ఉన్నాసరే, పజలకోసం పనిచేశా. అయినా ఇంత దారుణంగా ప్రజలు ఎందుకు ఓడించారో అంతుబట్టడం లేదు" అని జిల్లా వైసీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా వాపోయారు. స్థానిక సంహిత కన్వెన్షన్ హాలులో బుధవారం ఉదయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజానగరం నియోజక వర్గంలోని ప్రతి గ్రామంలో గతంలో చేసిన అభివృద్ధితో పోలిస్తే 20, 30రెట్లు అభివృద్ధి గడిచిన ఐదేళ్లలో చేశామన్నారు. 20వేల కుటుంబా లకు ఇళ్లపట్టాలు ఇచ్చామని, ఇంటి నిర్మాణానికి లోన్కూడామంజూరుచేయించామని,1773కోట్ల పైచిలుకు అభివృద్ధి కార్యక్రమాలు చేశామని,1377 కోట్ల రూపాయలతో వివిధ సంక్షేమ పథకాలనుఅమలుచేశామని,అదేవిధంగారాజానగరంమండలంకలవరిచర్లగ్రావ ంలోఇండస్ట్రీయల్ఎస్టేట్నిర్మాణానికిచర్యలుతీసుకున్నామని,నవరత్న పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందించామని ఆయన వివరించారు. కోరుకొండ సీతానగరం మండలాల్లో రెండు పంటలకు నీరు ఇచ్చాం. వ్యవసాయం చక్కగా చేసుకునేందుకు అనువైన పరిస్థితి ప్రభుత్వం కల్పించింది.విత్తనాలు, ఎరువులు, ఇన్పుట్ సబ్సిడీ, పురుగుమందులు, గోడౌన్లు, యంత్ర పరికరాలు అన్నీ అందించాం. 91ఒక కోట్ల రూపాయలతో బొబ్బిలంక తొరిగడ్డ రివర్స్ పంపింగ్ స్కీం నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని,రూ. 25 కోట్లతో తొర్రిగడ్డ పంపిణీ స్కీం మోడరనైజ్ చేశాం. ప్రతి చిన్న ఫిర్యాదుకు స్పందించి జవాబుదారీ తనంతో పని చేశాం. నియోజకవర్గంలో లక్ష కుటుంబాలు ఉంటే 80 వేల కుటుంబాలకు వద్దకు నేనే వెళ్ళాను. నా కుటుంబ సభ్యులంతా ఎన్నో రకాల సహాయ కార్యక్రమాలు నియోజకవర్గంలో నిర్వహించాం.కాపు రిజర్వేషన్ కోసం శ్రమించిన ముద్రగడ లాంటి నాయకుడు అనేక మాటలు పడ్డారు. కాపుల కష్టాలను ఎనాడు పట్టించుకోని నాయకులు హీరోలు అయిపోయారు. గతంలో ఇదే కూటమి అధికారంలో ఉండగా చంద్రబాబు ఇచ్చిన 650హామీలు నెరవేర్చకపోయినా ప్రజలు ఇప్పుడు అదే కూటమికి పట్టం కట్టారు. మరి హామీలు చూసి ప్రజలు మోసాపోయారనుకోవాలా .. ప్రజలకోసం అనునిత్యం తపిస్తూ వారికి మంచి చేయాలని చూడడం మా తప్పా అనేది తెలియడం లేదు. ప్రజల కోసం పట్టించుకోనివాళ్ళు, తరచూ అమెరికా వెళ్లి వచ్చేవాళ్ళు వేల మెజార్టీతో నెగ్గేసారు. ఈ పరిస్థితి చూస్తే ఇంతవరకు భ్రమలో బతికామా అన్నట్టు అనిపిస్తుంది. మీకు మంచి చేసి ఉంటే నాకు ఓటు వేయమని అడిగిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే. దేశంలో ఏ ముఖ్యమంత్రి కైనా ఇలాంటి ఈ దమ్ముందా?. గెలిచినా ఓడినా రియల్ హీరో జగన్ మాత్రమే.ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తాం. ఏదేమైనా ప్రజల కోసం పనిచేస్తాం. ప్రాణం ఉన్నంతవరకు డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి కుటుంబంతోనే కలిసి నడుస్తాం" అని జక్కంపూడి రాజా వ్యాఖ్యానించారు. సీఎం పేషీలో ఉన్న ధనుంజయ రెడ్డి లాంటి అధికారుల తీరు కూడా తమను దెబ్బతీసిందని కోరుకొండ దేవాలయ భూముల రీరిజిస్ట్రేషన్ వంటి సమస్యల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరే సదరు అధికారి పట్టించుకోలేదని జక్కంపూడి రాజా ఆవేదన చెందారు.మంచి మనసుతో ఉన్న జగన్ ఇలాంటి అధికారులను నమ్మడం వలన , వాళ్ళు భ్రమలో ఉంచేశారని ఆయన అన్నారు.మొత్తం మీద ఓటమి కి గల కారణాలన్నీ విశ్లేషించుకుని ప్రజలతో మమేకమవు తామని ఆయన అన్నారు.ఆరునెలలు గడిస్తే ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం ఎంతవరకు అమలు చేస్తుందో ప్రజలే గమనిస్తారన్నారు. ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా నెగ్గినవారికి అభినందనలుతెలిపారు.

## పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ పెద్దపీట

**-ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**



**టి మీడియా,జూన్ 5,అచ్చంపేట :** పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. బుధవారం అచ్చంపేట పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెగా సర్జికల్ క్యాంపును ప్రారంభించిన ఆయన స్వయంగా శస్త్ర చికిత్సలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ%ా%. ఒక డాక్టర్‌గా, అచ్చంపేట నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో వుంటూ సేవలందిస్తుంటానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదప్రజల ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట వేసిందన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్ఫూర్తితో అచ్చంపేట నియోజకవర్గంలోని పేద ప్రజల ఆర్థిక స్థితిగతుల దృష్ట్యా రాష్ట్రంలో ఎవ్వరూ, ఎక్కడా తలపెట్టని విధంగా మెగా సర్జికల్ క్యాంపును చేపట్టడం జరిగిందన్నారు. రికార్డు స్థాయిలో 1230 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక కాగా, ఆపరేషన్ తీవ్రతను బట్టి దశల వారిగా ఆపరేషన్లు నిర్వహించుటకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ మెగా క్యాంపులో జనరల్ సర్జన్లు రామచందర్, మహేశ్, బాల్‌సింగ్, డాక్టర్ ఉదయ్, హరిత, అనెస్థిసియా డాక్టర్ ప్రభు, థియేటర్ ఇంచార్జి డాక్టర్లు శిరీష మొదలగు 20 మంది డాక్టర్లతో 4 టీములుగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**టి మీడియా,జూన్ 5,గద్వాల :** గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ నిర్మాణ పనులను ఇవాళ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడం జరిగిందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గద్వాల జిల్లాలో మెడికల్ కాలేజీ మంజూరు చేసుకోవడం జరిగిందని, దాదాపుగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి కావడం జరిగిందన్నారు. త్వరలోనే అన్ని రంగులతో అన్ని పరికరాలతో ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చి త్వరలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని ప్రారంభించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ సంవత్సరం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు త్వరలోనే ప్రారంభం రావడం జరుగుతుందని, అదేవిధంగా తరగతులు కూడా ప్రారంభించి మెడికల్ విద్యార్థులకు అన్ని విధాలా సౌకర్యాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా మెడికల్ కాలేజీలో సౌకర్యాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందించే విధంగా తమ వంతు కృషిచేసి ప్రభుత్వ సహకారంతో కూడా అన్ని విధాలుగా మెడికల్ కాలేజ్ కి తన వంతు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, జి.వేణుగోపాల్, ఎంపీపీ విజయ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాబర్, కౌన్సిలర్స్ మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంగడి బసవరాజ్, మహబూబ్, నవీన్ రెడ్డి, భగీరథ వంశీ, కురుమన్న, మధు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## 9న రెండోసారి సిక్కిం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం

**-క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్ సింగ్ తమాంగ్**



**టి మీడియా,జూన్ 5,సిక్కిం :** క్రాంతికారీ మోర్చా అధినేత ప్రేమ్ సింగ్ తమాంగ్ జూన్ 9న రెండోసారి సిక్కిం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లోని పాల్జోర్ స్టేడియంలో తమంగ్ తో పాటు పలువురు మంత్రులు ప్రమాణం చేస్తారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సిక్కింలోని వివిధ ప్రాంతాలతో పాటు ఎస్‌కేఎం నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో, సిక్కింలోని ఏకైక లోక్‌సభ స్థానంలో అధికార ఎస్‌కేఎంకు భారీ మెజారిటీ అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.తమ ఎంపీ అభ్యర్థి ఇంద్ర హంగ్ కేంద్రంతో ఎన్డీయేకు మద్దతిస్తారని చెప్పారు. సిక్కిం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఏకకాలంలో జరిగిన ఎన్నికల్లో 32 అసెంబ్లీ స్థానాలకు గానూ 31 స్థానాలను ఎస్‌కేఎం గెలుచుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయనను ఎస్‌కేఎం శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. కాగా, ఐదేళ్ల క్రితం కూడా తమంగ్ జూన్ 9నే ప్రమాణ స్వీకారం చేశారు.

## ఎన్నికల ఫలితాలపై స్పందించిన దేశాధినేతలు



**టి మీడియా, జూన్ 5,చైనా :** భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై పలు దేశాధినేతలు స్పందించారు. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి విజయం సాధించినందుకు చైనా బుధవారం ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలిపింది. ద్వైపాక్షిక సంబంధాల యొక్క ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భారత్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉందని చైనా తెలిపింది.భారత సార్వత్రిక ఎన్నికల ఫలితాలను మేము గమనించాము. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఎన్‌డిఎ నేతృత్వంలోని బిజెపి విజయానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము" అని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ అన్నారు. రెండు దేశాల ప్రాథమిక ప్రయోజనాలను, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ద్వైపాక్షిక సంబంధాలను స్థిరమైన మార్గంలో ముందుకు తీసుకెళ్లేందుకు భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

**మోడీకి శుభాకాంక్షలు : ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**

భారత సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించినందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాని నరేంద్ర మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇండో-ఇజ్రాయెల్ సంబంధాలు "నూతన శిఖరాలకు" పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "వరుసగా మూడోసారి ఎన్నికైనందుకు ప్రధాని నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. భారతదేశం %-% ఇజ్రాయెల్ మధ్య స్నేహం నూతన శిఖరాలకు ఎదుగుతూనే ఉంటుంది. బధాయి హెూ!" అంటూ నెతన్యాహు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో ట్వీట్ చేశారు.

## ప్రకృతిని ప్రేమించాలి పర్యావరణాన్ని రక్షించాలి

**ఎబండి రాజు**



**టీ మీడియా, జూన్ 5, వనపర్తి బ్యూరో :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని రిపోర్టర్ బండి రాజు అన్నారు. బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మూడు సంవత్సరాల క్రితం బండి రాజు నాటిన మొక్కలకు నీరు పోసి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. బండి రాజు జన్మదిన సందర్భంగా పర్యావరణ దినోత్సవం రోజు తను నాటిన మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్నారు. చెట్లే ప్రగతికి మెట్లు, ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అన్నారు.

## ఏపీ శాసనసభ రద్దు




**టి మీడియా, జూన్ 5,అమరావతి :** ఆంధ్రప్రదేశ్ శాసనసభను గవర్నర్ అబ్దుల్ నజీర్ రద్దు చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి పదవికి జగన్ రాజీనామా చేసి, గవర్నర్ కు అందించారు. దీనికి గవర్నర్ బుధవారం ఆమోదం తెలపడంతో 15వ అసెంబ్లీ రద్దు అయింది. కాగా.. ఏపీ ఎన్నికల్లో చంద్రబాబు ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సదరు వర్గాల సమాచారం.

## కేజ్రీవాల్‌కు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



**టి మీడియా, జూన్ 5,ఢిల్లీ :** మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి బెయిల్‌ను పొడిగించాలని కేజ్రీవాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును ఈ రోజుకు వాయిదా వేసింది. కేజ్రీవాల్ పిటిషన్‌ను తాజాగా తిరస్కరించింది. ఆయన జ్యుడీషియల్ కస్టడీని జూన్ 19 వరకు పొడిగించింది. ఆయన వైద్య అవసరాలను చూసుకోవాలని జైలు అధికారులకు ఆదేశించింది.

## సచివాలయం ఐటీ విభాగంలో పోలీసుల తనిఖీలు




**టి మీడియా, జూన్ 5, అమరావతి:** సచివాలయంలోని ఐటీ విభాగంలో బుధవారం ఉదయం పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐటీ విభాగంలోని కంప్యూటర్‌ల నుంచి డేటా తస్కరణకు, డిలీట్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారుల తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఐటీ కమ్యూనికేషన్ విభాగంలో ఉద్యోగుల కంప్యూటర్‌లు, ల్యాప్ ట్యాప్‌లు, ఇతర ఉపకరణాలను తనిఖీ చేశారు. ఉద్యోగుల నుంచి పెన్‌డ్రైవ్‌లు, డేటా హార్డ్ డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అమెరికాలో అదృశ్యమైన విద్యార్థిని సేఫ్




**టి మీడియా, జూన్ 5, హైదరాబాద్:** గత వారం అమెరికాలో అదృశ్యమైన హైదరాబాద్ విద్యార్థిని నితీశా కందుల (23) క్షేమంగా ఉన్నట్లు పోలీసులు మంగళవారం (జూన్ 4) తెలిపారు. ఆమెను సురక్షితంగా గుర్తించినట్లుగా శాన్‌బెర్నార్డినో పోలీస్ డిపార్ట్‌మెంట్ ఈరోజు వెల్లడించింది. శాన్ బెర్నార్డినో లోని కాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న నితీషా కందుల అనే విద్యార్థిని మే 28 నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.దీంతో సాయం కోసం ఆమె కుటుంబసభ్యులు సోషల్‌మీడియా వేదిక ద్వారా అక్కడి పోలీసులను అభ్యర్థించారు. దీనిపై దర్యాప్తు చేపట్టిన శాన్ బెర్నార్డినో పోలీసులు నితీషా లొకేషన్‌పై సమాచారం కోసం పోలీసులు పబ్లిక్ అప్పీల్ చేశారు. చివరిగా లాస్ ఏంజెల్స్‌లో కాలిఫోర్నియా నంబర్ ప్లేట్‌తో ఉన్న ఓ టయోటా కారు నడుపుతూ మే 30న కనిపించినట్లు కొంత మంది చెప్పినట్టు వెల్లడించారు. ఈ మేరకు పోలీసులు ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టగా చివరకు క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసు చీఫ్ జాన్ గుట్టీరెజ్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. గత కొంతకాలంగా అమెరికాలో భారతీయ విద్యార్థులు వరుస ప్రమాదాల్లో అదృశ్యమవుతున్న సంగతి తెలిసిందే. గత నెలలో 26 ఏళ్ల రూపేష్ చంద్ర చింతకింద్ అనే మరో భారతీయ విద్యార్థి చికాగోలో అదృశ్యమయ్యాడు. ఇదే ఏడాది మార్చిలో హైదరాబాద్‌కు చెందిన 25 ఏళ్ల మహ్మద్ అబ్దుల్ అర్ఫాత్ అనే విద్యార్థి ఏప్రిల్‌లో క్లీవ్‌ల్యాండ్‌లో శవమై కనిపించాడు. అర్ఫాత్ క్లీవ్‌ల్యాండ్ యూనివర్సిటీలో ఐటిలో మాస్టర్స్ చదవడానికి మే నెలలోనే సదరు విద్యార్థి యుఎస్ వచ్చాడు.

## కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు మృతి..



**టి మీడియా,జూన్ 5,హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మియాపూర్ లో విషాదం చోటు చేసుకుంది. కుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడు మృతి చెందాడు. మియాపూర్ లో భిక్షాటన చేస్తున్న కుటుంబానికి చెందిన బాలుడు సాత్విక్.. జూన్ 4వ తేదీ మంగళవారం ఆడుకునేందుకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ క్రమంలో జూన్ 5వ తేదీ బుధవారం ఉదయం మక్తాలోని నిర్మానుష్య ప్రాంతంలో బాలుడి మృతదేహాన్ని స్థానికులు గర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాలుడి ఒంటి మీద కుక్కలు దాడి చేసిన కాట్లు ఉన్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డు కావడంతో కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు.

టి- మీడియా న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
GST IN - 36FDKPS 1308PZX
అన్ని పార్టీలు వారికి రాజకీయ ఉపన్యాస పాయింట్స్
- ప్రత్యేక (డిజిటల్, ప్రింట్) సంచికలు
- సోషల్ మీడియా సర్వీసెస్
- పత్రికలకు వార్తలు, స్టోరీలు
- అన్నిరకాల యాడ్స్ డిజైనింగ్
tmedia.net.in, epaper.tmedia.net.in, News Agency & Media Consultancy, Youtube Channel, Facebook, Instagram, Twitter
ప్రెస్‌మీట్ ఏర్పాటు, ప్రెస్‌నోట్లు తయారీ, ప్రత్యేక దిన పత్రిక డిజిటల్ ఎడిషన్‌లు కోసం
దేశంలో ఎక్కడి వారు అయిన సంప్రదించండి :
8919710365 కు కాల్ చేయండి

మార్కెటింగ్‌లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్ పని చేయుటకు కావలెను
టీ మీడియా లోని ప్రింట్ /ఈ పేపర్ /పెళ్లి పందిరి /ఆన్లైన్ విభాగం /ఎలక్ట్రానిక్ విభాగం ల లో (టోటల్ తెలుగు మీడియా) మార్కెటింగ్ లో పార్ట్ టైమ్/ఫుల్ టైమ్.. (30నుండి 40శాతం )కమిషన్ బేసిక్ పై పని చేయూటకు ఆసక్తి ఉన్నవారు 8500515365 కి పంపగలరు. అవసరం అయిన శిక్షణ ఇస్తాము. నెలకు కనీసం గా రు 20వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.
తమ వివరాలు :
పేరు :........................................
ప్రస్తుత నివాసం :..................చదువు :..................
సెల్ నెంబర్ :........................................

Spot Speed NEWS
T MEDIA
న్యూస్ ఏజెన్సీ & మీడియా కన్సల్టెన్సీ
APGVB రోడ్, మామిళ్ళగూడెం, ఖమ్మం. సెల్ : 8919710365
మా సేవలు : ఉపన్యాసాలకు పాయింట్లు,
ప్రెస్ నోట్స్, ప్రత్యేక సంచికలు, యాడ్ డిజైన్స్, పేజ్ మేకింగ్
Please Subscribe : tmedia.net.in